
శివశక్తి నగర్‌లో ..


కొకుంట్లలో..


మిడ్జిల్‌లో లడ్డు దక్కించుకున్న భక్తుడు విజయ్‌కుమార్


ఆదర్శనగర్‌లో..

గణపయ్యకు.. ఘనమైన పూజలు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గణపయ్యకు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఝాన్సీ నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవేందర్, రాఘవేందర్, గణేష్, భాను తదితరులు పాల్గొన్నారు. రాజాపూర్ మండల కేంద్రంతో రాయపల్లి, మల్లేపల్లి, తిరుమలాపూర్ గ్రామాల్లో వైభవంగా పూజలు జరుగుతున్నాయి. ఉడిత్యాలలో శనివారం చంద్రశేఖర్ ఆజాద్ యూత్ ఆధ్వర్యంలో గణపతి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనారాయణగౌడ్, నరేందర్, మల్లేష్, బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు. మిడ్జిల్‌లో శనివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. బస్టాండ్ దగ్గర వేలం పాటలో మిడిదొడ్డి విజయ్‌కుమార్ రూ. లక్షా 25 వేలకు లడ్డును సొంతం చేసుకున్నారు. నవాబుపేట పరిధిలో ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొకుంట్లలో మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు రూ. 1.20 లక్షలకు వేలం పాటలో వినాయకుడి చేతిలో లడ్డూను దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో శనివారం భక్తులకు అన్నదానం చేశారు. గండేడ్ పరిధిలోని వెన్నాచేడ్‌లో గణపతి హోమం నిర్వహించారు. మాజీ సర్పంచులు పుల్లారెడ్డి, గోపాల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


బోయపల్లి కోట్ల వీధి వినాయకుడి వద్ద భజనలు


జిల్లాకేంద్రంలోని భవసార్ క్షత్రీయ సమాజ్ ఆధ్వర్యంలో పూజలు


నవాబుపేట రవీంద్ర యువజన సంఘం గణపతి


నవాబుపేట హనుమాన్ ఆలయ గణపతి

దశాబ్దాలుగా లంబోదరుడి సేవలో..

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలు.. గ్రామాల పరిధిలోని కొన్ని యువజన సంఘాలు కొన్ని దశాబ్దాలుగా గణపయ్య పూజలు నిర్వహిస్తూ.. ఏటా మండప నిర్వహణ చేస్తూ తరిస్తున్నాయి. వివరాలు ఇలా..

నవాబుపేటలో 83 ఏళ్లుగా..


నవాబుపేట: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి ఆకట్టుకుంటున్నాడు. గతంలో ఆలయంలో మట్టితో చేసిన గణపతిని పూజించే వారు. అనంతరం చెక్కతో చేసిన గణపతిని కొన్ని సంవత్సరాల పాటు ఆరాధించారు. కాలక్రమేణా ఇతర ప్రాంతాల్లో తయారు చేసిన గణపతిని తీసుకుని వచ్చి ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. కాగా ఇక్కడ దాదాపుగా 83 ఏళ్ల నుంచి చవితి పండుగ ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సిల్వర్ జూబ్లీ గణపతి

అదేవిధంగా మండల కేంద్రంలోని రవీంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న గణపతి వేడుకలకు సిల్వర్ జూబ్లీ తాజాగా పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.

దేవరకద్రలో 40 ఏళ్లుగా..

దేవరకద్ర: మండల కేంద్రంలోని తీగలప్ప కట్ట చౌరస్తాలో 40 ఏళ్లుగా గణపతిని ప్రతిష్ఠిస్తూ వస్తున్నారు. ఆ రోజుల్లో పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఒక చిన్నపాటి విగ్రహాన్ని ప్రతిష్ఠించే వారమని స్థానికులు చెబుతున్నారు. దివంగత మాజీ ఎంపీపీ చిన్నయ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో 1985లో మొదటి సారి తీగలప్పకట్ట చౌరస్తాలో బాలగణేశుని విగ్రహం ప్రతిష్ఠించారని వివరించారు. ఇలా ప్రారంభమైన వేడుక ఆ తరువాత పట్టణంలోనే భారీ విగ్రహం ఏర్పాటు చేసే స్థాయికి వచ్చిందని చెబుతున్నారు. ఈ సంవత్సరం కూడ దేవరకద్రలోనే భారీ విగ్రహం ఇక్కడ ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు.


దేవరకద్రలోని తీగలప్పకట్ట గణపతి


జిల్లాకేంద్రంలోని వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో మట్టి గణపతి

12 ఏళ్లుగా మట్టి వినాయకుడి సేవలో..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని పోచమ్మ గుడి ప్రాంతంలోని వినాయక యువజన సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా మట్టి గణపతి సేవలో తరిస్తున్నారు. అందులో భాగంగా ఈసారి సైతం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. యువజన సంఘం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలనే సంకల్పంతో మట్టి వినాయకుడిని సేవ చేస్తున్నట్లు వివరించారు. నాయకులు జంగం మల్లేష్, శ్రీనివాసు, చెన్నారెడ్డి, సూర్యనారాయణ, నాగరాజు, రాజు, నర్సప్ప, మహేష్, చింతల్ నారాయణ తదితరులు మాట్లాడారు.


వెన్నాచేడ్‌లో గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు


అమిస్తాపూర్ సారిక టౌన్‌షిప్‌లో కోలాటం వేస్తున్న మహిళలు


రాజాపూర్‌లో..


మిడ్జిల్‌లో కోలాటం వేస్తున్న మహిళలు


ఉడిత్యాలలో అన్నదానం

క్లుప్తంగా

అంబులెన్సులో ప్రసవం

గండేడ్/మహమ్మదాబాద్: అంబులెన్సులో మహిళా ప్రసవించిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చిన్నాయిపల్లికి చెందిన అనురాధకు నెలలు నిండడంతో శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబీకులు 108 అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అంబులెన్సును పక్కకు ఆపిన సిబ్బంది కుటుంబ సభ్యుల సాయంతో పురుడు పోశారు. అనురాధ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

నీటి కలుషితంపై ఫిర్యాదు

నవాబుపేట: కూచూర్‌లో మిషన్ భగీరథ నీరు కలుషితంగా వస్తోందని నివారించాలంటూ గ్రామస్తులు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఎక్కడ చూసిన ఒండ్రు మట్టి నీరే వస్తోందన్నారు. నీటిని శుద్ధి చేసి అందించాలని కోరారు. సంబంధిత అధికారులను వివరణ కోరగా గ్రామంలో సరఫరా అవుతున్న నీటిని శాంపిల్ తీసి ల్యాబ్‌కు పంపిస్తామని అన్నారు. అనంతరం వాటి రిపోర్టు ఆధారంగా నివారణ చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఏఈ సురేష్ వివరించారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



రాజాపూర్: ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని.. అందుకోసం అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని రాజాపూర్ ఎస్‌ఐ రవి పేర్కొన్నారు. శనివారం జాతీయ రహదారిపై యాక్సిడెంట్ పాయింట్స్‌ను గుర్తించి ప్లాస్టిక్ డ్రమ్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. ముఖ్యంగా మైనర్‌లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలు జీవితం గడపాల్సి ఉంటుందని అన్నారు.

కార్యవర్గం ఎన్నిక

హన్వాడ: పీఆర్‌టీయూ టీఎస్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మదన్‌మోహన్, స్వామి, అసోసియేట్ అధ్యక్షుడిగా వన్నాడ శ్రీను, రఘురాంగౌడ్, ఉపాధ్యక్షుడిగా దశరథ రాంరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా నసీబ్, కార్యదర్శిగా నర్సింహారెడ్డి, మహిళా కార్యదర్శిగా శైలజ ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, ఎంఈఓ రాజునాయక్ హాజరయ్యారు.

ఎల్‌ఐసీని కాపాడుకోవాలి



ప్రసంగిస్తున్న మద్దిలేటి

జడ్చర్ల: ఎల్‌ఐసీని సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని ఆల్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం జడ్చర్ల బ్రాంచ్ కార్యాలయంలో జరిగిన యూనియన్ సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో నెలకొని ఉన్న క్లిష్ట పరిస్థితులు బీమా రంగానికి గొడ్డలి పెట్టులా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక రంగానికి ఆయువు పట్టుగా ఉన్న ఎల్‌ఐసీని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరేక చర్యలను అడ్డుకోవాలని అప్పుడే ఎల్‌ఐసీకి మనుగడ ఉంటుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

జడ్చర్ల ఎల్‌ఐసీ బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా సాబేర్, సంయుక్త కార్యదర్శులుగా ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులను ఎన్నుకున్నారు.

సమ్మె వీడని కార్మికులు

మహమ్మదాబాద్: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు రెండో రోజు కూడా సమ్మె కొనసాగించారు. 12 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమ్మె నేపథ్యంలో శుక్రవారం గ్రామంలో సంత కావడంతో చెత్త చెదారం రోడ్లపైనే ఉండిపోయింది. వీటిని తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి ప్రైవేటు లేబర్‌ను ఏర్పాటు చేయగా.. పంచాయతీ కార్మికులు వారిని అడ్డుకున్నారు. దీంతో కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా వారు అక్కడికి వచ్చి పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. ఎన్ని రకాలుగా ప్రయత్నించిన వారు ఒప్పుకోకపోవడంతో చేసేది లేక పోలీసులు వెళ్లిపోయారు. కాగా ఆదివారం పంచాయతీ కార్మికులతో మాట్లాడతామని కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.


పోలీసులతో మాట్లాడుతున్న కార్మికులు

చరిత్ర వక్రీకరణే బీజేపీ నైజం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: దేశ పోరాట చారిత్రక ఘట్టాల వక్రీకరణనే బీజేపీ ప్రభుత్వ నైజమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. తెలంగాణ గడ్డపై భూమి కోసం భుక్తి కోసం పీడిత జన విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వంలో వీరోచిత విప్లవ పోరాటాలు చేసిన మహనీయుల చరిత్ర మరువలేనిదన్నారు. రైతాంగ పోరాట స్ఫూర్తితో భూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. జిల్లా కార్యదర్శి బాలకిషన్, పరమేశ్‌గౌడ్, రాము, సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ సభ్యుడిగా నియమితులైన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని శనివారం జిల్లా కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ఎం.సాయిబాబా తదితరులు ఘనంగా సన్మానించారు. జిల్లాకు సంబంధించి ఎస్సీ సబ్‌ప్లాన్, సాధారణ నిధులతో ఎస్సీ వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

హక్కుల సాధనకు పోరాటం చేద్దాం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ (ఆల్‌మేవా)ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఉమ్మడి జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగానే దేశంలోని ముస్లింలను అణచివేసి వారి భూములను లాక్కొని రెండోతరగతి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగానే వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చిందన్నారు. హక్కుల సాధన కోసం ముస్లింలు పోరాటానికి సిద్ధపడాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో సంఘం సభ్యత్వాలను అధిక మొత్తంలో చేయాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ అయ్యూబ్, అబ్దుల్ ఖలీల్, వనపర్తి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఇస్రత్‌అలీ, సయ్యద్ అబ్దుల్ జమీర్, నారాయణపేట అధ్యక్ష, కార్యదర్శులుగా ఫజీవుర్ రహెమాన్, ఖాజా మహెబూబ్‌ఖాన్, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్ ఆబిద్‌అలీ, మహ్మద్ లతీఫ్‌లను ఎన్నుకొని నియామకపత్రాలు అందజేశారు.


నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర ప్రతినిధులు

కేఎల్‌ఐ కాల్వ పనులు ప్రారంభం


పనులను పరిశీలిస్తున్న అధికారులు

మిడ్జిల్: మండల పరిధిలోని మున్ననూర్ దగ్గర ఇటీవల భారీ వర్షాలకు తెగిపోయిన కేఎల్‌ఐ కాల్వ పనులను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ప్రారంభించారు. పనులను డీఈ ప్రియా, ఏఈ పవన్ దగ్గర ఉండి పర్యవేక్షించారు. మొదట బండింగ్ ఏర్పాటు చేసిన తర్వాత, తెగిపోయిన చోట నల్లమట్టితో పూడుస్తారని వివరించారు. కాంగ్రెస్ నాయకులు గౌస్, వెంకటేష్ గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలను హిందీ ఐక్యం చేసింది

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వాతంత్య్ర ఉద్యమ సమయంలో దేశ ప్రజలను హిందీ భాష ఒక్కతాటిపైకి తెచ్చిందని.. అందరినీ ఐక్యం చేసిందని ఆర్యసభ ఉపాధ్యక్షుడు చంద్రయ్య, వాసవీ డిగ్రీ, పీజీ కాలేజీ కరెస్పాండెంట్ శ్రీనివాసయ్య అన్నారు. శనివారం వాసవీ డిగ్రీ కాలేజీలో హిందీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బ్రిటీష్ పాలన కాలంలో హిందీ భాష దేశ ప్రజలకు చాలా ఉపయోగ పడిందన్నారు. అనంతరం పలువురిని ఘనంగా సన్మానించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


చంద్రయ్యతో అధ్యాపకులు

ప్రయాణికురాలికి బ్యాగ్ అందజేత

జడ్చర్ల టౌన్: పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్ మేనేజర్ జయరాజ్ సమయస్ఫూర్తితో ఓ ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును తిరిగి ఇప్పించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా.. శనివారం మధ్యాహ్నం బస్టాండ్‌లో బోరున విలపిస్తూ ఓ వృద్ధురాలు కూర్చుని ఉండడాన్ని గమనించిన మేనేజర్ వివరాలు అడిగి తెలుసుకున్నాడు. కాగా తాను దంతనూర్ గ్రామానికి చెందిన గిరమ్మగా ఆమె తెలిపింది. వనపర్తి డిపో బస్సు హైదరాబాద్‌లో ఎక్కి తన బ్యాగును బస్సులోనే మరిచి జడ్చర్లలో దిగినట్లు వాపోయింది. బ్యాగులో విలువైన బంగారు, వెండి ఆభరణాలతోపాటు కొన్ని విలువైన వస్తువులు ఉన్నట్లు వివరించింది. దీంతో వనపర్తికి వెళ్తున్న బస్సు కండక్టర్‌కు మేనేజర్ ఫోన్ చేసి వివరాలు తెలిపి బ్యాగ్ ఉందో లేదో చూడమన్నారు. బ్యాగు బస్సులోనే ఉందని కండక్టర్ సమాధానం ఇవ్వటంతో దానిని జడ్చర్ల బస్టాండ్‌కు పంపించాలని సూచించారు. నాగర్‌కర్నూలు బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్తున్న బస్సులో బ్యాగును పంపించగా జడ్చర్లలో దానిని తీసుకుని ప్రయాణికుల సమక్షంలో గిరమ్మకు అందించారు. దీంతో ఆమె సంతోషం వ్యక్తం చేసింది. ప్రయాణికులు మేనేజర్‌ను అభినందించారు.



పరిహారం చెల్లింపులో గోల్‌మాల్!

జడ్చర్ల: ఉదండాపూర్ నిర్వాసితులకు ఏర్పాటు చేస్తున్న పునరావాసం భూములకు సంబంధించి రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహారంలో గోల్‌మాల్ జరిగినట్లు పలువురు బాధితులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దేవునిగుట్టతండా, జయప్రకాశ్‌నగర్ సమీపంలో గల భూములను నిర్వాసితులకు పునరావాసం కోసం కేటాయించారు. అయితే ఆయా భూములను సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం తమ ఖాతాలలో జమ చేయకుండా కేవలం నలుగురి ఖాతాల్లోనే జమ చేశారని బాధితులు వాపోయారు. 407, 425, 426 సర్వే నంబర్లలోని 4.20 ఎకరాల భూమికి సంబంధించి సుమారు రూ.50 లక్షల చెల్లింపులో అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన విచారణకు ఆదేశించారు.

ఆచార్య దేవోభవ అవార్డు



దేవరకద్ర: లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అశ్విని చంద్రశేఖర్ ఆచార్య దేవోభవ అవార్డును అందుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని యువ తేజం ట్రస్టు, కలాం విజన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి వివి గిరి మనుమడు సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డును తీసుకున్నట్లు వివరించారు. ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలందించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన 137 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేశారని పేర్కొన్నారు.

నేడు జాగరణ

జడ్చర్ల టౌన్: మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ముస్లింలు జాగరణ చేయనున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని మసీదులను ముస్తాబు చేశారు. సోమవారం ఉదయం కీర్ స్వీట్‌ను కుటుంబసభ్యులు, బంధుమిత్రులకు పంపిణీ చేయనున్నారు. అయితే సోమవారం ఊరేగింపు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ గణేష్ నిమజ్జనాలు పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వాయిదా వేశారు.

నీటి సమస్య లేకుండా చేస్తాం

గండేడ్: గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య లేకుండా చేయడమే తమ లక్ష్యమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం రంగారెడ్డిపల్లిలో సీడీపీ నిధులతో కొత్తగా బోరు వేయించారు. యువజన నాయకుడు రవీందర్, అమ్మన్న, చందాబేగ్, బాలయ్య, కేశవులు పాల్గొన్నారు.